క్లుప్తంగా

ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళా సంఘాల సభ్యులకు సూచనలిస్తున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఏపీఎం పి.గోవిందరావు ఆకాంక్షించారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో గ్రామైక్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘాల పొదుపు రికార్డులను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు చేశారు. పొదుపు నిల్వలతో పాటు స్త్రీనిధి రుణాల వినియోగం, చెల్లింపులపై ఆరాతీశారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు.

పరామర్శ



కృష్ణ మెడికల్ రిపోర్టును పరిశీలిస్తున్న తలే రాజేష్

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం రోడ్డులో నివాసముంటున్న అద్దంకి కృష్ణను వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ గురువారం కలిసి పరామర్శించారు. మూడేళ్లుగా కృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, ఆయన భార్య నర్మద వద్ద ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, తోట తిరుమలరావు, ఓలేటి గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



ర్యాలీలో గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ సిబ్బంది

రేగిడి: ఆరోగ్యమే మహాభాగ్యమని ఐసీడీఎస్ రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం చేపట్టిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించిన ఆమె కేంద్రాల ద్వారా బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం క్రమం తప్పకుండా అందజేయాలని సూచించారు. మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకుంటేనే రక్తహీనత బారినపడకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని తెలిపారు. అనంతరం ర్యాలీ చేపట్టి, పౌష్టికాహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ జనార్థన్

వంగర: మండలంలోని కె.కొత్తవలస, కొప్పరవలస గ్రామ జంక్షన్ల వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్‌ఐ వై.వి.జనార్థన్ సిబ్బందితో కలిసి అటువైపుగా వస్తున్న వాహనదారులను ఆపి, వారి వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, వాహనదారుడి డ్రైవింగ్ లైసెన్స్‌ను పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. వాహనాలతో రోడ్లపైకి వచ్చినప్పుడు వాహన ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు.

చురుగ్గా ఫాగింగ్



వీధిలో దోమల మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

బొబ్బిలి: పట్టణంలోని పలు వీధుల్లో దోమల నివారణకు ఫాగింగ్(దోమల నివారణ మందు స్ప్రేయింగ్) చర్యలు గురువారం చేపట్టారు. సాయంత్రం పట్టణ పరిధిలోని పూల్‌భాగ్, అగ్రహారం ప్రాంతాల్లోని ప్రధాన వీధులు, కాలువల వద్ద మున్సిపల్ శానిటరీ సిబ్బంది దోమల నివారణ మందు స్ప్రే చేసినటుల మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు

రాజాం: స్థానిక చీపురుపల్లి రోడ్డులోని గాయత్రీదేవి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో గురువారం ఉదయం కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు కొండవేటి తేజోమూర్తి, వివేకానందరావులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం
- అన్ని మండలాల్లోని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి
- కాపీయింగ్‌కు పాల్పడకుండా గట్టి నిఘా
- రోజు విడిచి రోజు ఫస్టియర్, సెకండియర్ పరీక్షలు



బాడంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బెంచీలపై విద్యార్థుల హాల్ టికెట్ల నంబర్లు వేస్తున్న సిబ్బంది



రాజాం సిటీ: ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న చీఫ్ సూపరింటెండెంట్ జగదీష్‌కుమార్

రాజాం సిటీ: ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో మొత్తం 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, వాటిలో 31,394 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చీఫ్ సూపరింటెండెంట్ యు.జగదీష్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇన్విజిలేటర్లతో గురువారం సమావేశమైన ఆయన పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఎవరూ కాపీయింగ్‌కు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కూడా ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. శుక్రవారం నుంచి జరిగే ఈ పరీక్షల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఒకరోజు పరీక్ష ఉంటే సెకండియర్ విద్యార్థులకు మరుసటిరోజు పరీక్ష ఉంటుందని, ఆయా విద్యార్థులకు రోజు తప్పించి రోజు పరీక్ష ఉంటుందని పరీక్ష కేంద్రాల చీఫ్‌లు వి.శంకరరావు, టి.రామదాసు తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుందన్నారు. తొలిరోజు జరిగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర తెలుగు పరీక్షకు గురుకుల పాఠశాలలో 173 మంది, ప్రభుత్వ కళాశాలలో 209 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఆయా కేంద్రాల్లో ఆయా కళాశాలలతో పాటు కేజీబీవీ, శ్రీటీఎల్ఎన్, బూసాయివలస కేజీబీవీ, శిరారుగంజి కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాళి మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రంలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో తెర్లాం శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల, కుమ్మరిపేట కేజీబీవీ, పెరుమాళి మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించమని స్పష్టం చేశారు.

‘పల్స్ పోలియో’ను విజయవంతం చేద్దాం



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

రామభద్రపురం: మండలంలో ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష పిలుపునిచ్చారు. ఇదే విషయమై వారు స్థానిక పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందితో గురువారం సమావేశమై, కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఐదేళ్లలోపు వయసున్న పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఆరోజు ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే కార్యక్రమంలో పిల్లలందరికీ దాదాపు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని, తొలిరోజు చుక్కలు వేయని పిల్లలకు 4, 5వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి, చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారులు దిలీప్‌కుమార్, శిరీష

వంగర: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బందితో సమావేశమైన ఆయన మార్చి 3వ తేదీ నుంచి జరిగే పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని తెలిపారు. పిల్లలందరూ పోలియో చుక్కలు వేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాల్మన్‌రాజ్, వైద్యాధికారులు దయాన, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ త్రినాథరావునాయుడు



సంతకవిటి: ఎంపీడీవో పైడితల్లికి పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

బొబ్బిలి: మండల తహసీల్దార్‌గా వి.త్రినాథరావు నాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై, ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా విధుల నిర్వహణ ఉండాలన్నారు. పక్కాగా ఓటరు జాబితా తయారు కావాలన్నారు. కార్యక్రమంలో డీటీ రెడ్డి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: ఎంపీడీవోగా పైడితల్లి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎస్.రామకృష్ణ పాలకొండ ఎంపీడీవోగా బదిలీపై వెళ్లారు. అక్కడ ఎంపీడీవో పనిచేసిన పైడితల్లి ఇక్కడి ఎంపీడీవోగా వచ్చారు.

పక్కాగా సర్వే చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధుసూదనరావు

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో ఎం.ఎస్.ఎం.ఈ(మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజస్) సర్వేను సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లంతా పక్కాగా చేయాలని ఎంపీడీవో బి.మధుసూదనరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశమైన ఆయన మార్చి 1 నుంచి 20వ తేదీలోగా అన్ని గ్రామాల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలను గుర్తించి, వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామాల్లో అన్నిరకాల పరిశ్రమలు, సర్వీస్ సెక్టార్లలో ఉన్న అతిసూక్ష్మ, సూక్ష్మ పరిశ్రమలు, ఇతర వ్యాపార సంస్థల వివరాలు గుర్తించడంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసినప్పుడు ఎటువంటి తప్పులు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

శరవేగంగా గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులు



విజయరాంపురంలోని పొలాలకు వెళ్లేందుకు వీలుగా రోడ్డు పనులు చేపడుతున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని విజయరాంపురం(బూరిపేట)తో పాటు పలు గ్రామాల్లోని పొలాలకు వెళ్లేందుకు వీలుగా బూరిపేట నుంచి గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బూరి మధుసూదనరావు గురువారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో పొలాలకు వెళ్లేందుకు రైతులు నానా అవస్థలు పడేవారని, ఇదే సమస్యను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల దృష్టికి తీసుకువెళ్లామని సర్పంచ్ తెలిపారు. సమస్యపై స్పందించిన జెడ్పీ చైర్మన్ జిల్లా పరిషత్ నిధులు మంజూరు చేసి, పనుల ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యేకు, జెడ్పీ చైర్మన్‌కు సర్పంచ్, గ్రామపెద్దలు, రైతులంతా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

2న ఆశీల వేలం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని రోజువారీ మార్కెట్ వసూలుకు సంబంధించి, ఆశీల వేలంపాటను మార్చి 2వ తేదీన నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ వేలంలో పాటదారులు పాల్గొనాలని ఆయన కోరారు. వేలం దక్కించుకున్న వారికి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు రోజువారీ మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునే హక్కు ఉంటుందన్నారు. అయితే ఇప్పటివరకు ఐదుసార్లు వేలం నిర్వహించినప్పటికీ వేలంపాడేందుకు పాటదారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసిన విషయం తెలిసిందే.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేగిడి: మండలంలోని బూరాడ ఫీడర్ పరిధిలోని కాగితాపల్లి, అంబాడ, ఏవీపురం, పోరాం, ఒప్పంగి, కొర్లవలస, పారంపేట, పనసలవలస గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ లావేటి హరి ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. 11 కేవీ విద్యుత్ సరఫరా లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలి

రేగిడి: వేసవి ఎండల నేపథ్యంలో వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్త వహించాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ సూచించారు. మండలంలోని అంబకండి గ్రామంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన 124 మందికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. రానురాను వేసవి ఎండల తీవ్ర పెరగనున్న నేపథ్యంలో వడదెబ్బ బారినపడే అవకాశం ఉందని, అలాకాకుండా ఉండాలంటే రోజూ చల్లని మజ్జిగ, గ్లూకోజ్ నీటిని, పండ్ల రసాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.గోవిందనాయుడు, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలి

వంగర: గ్రామాల్లో అర్హులందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఎంపీడీవో సాల్మన్‌రాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, పనుల్లో పాల్గొంటున్న వేతనదారులు, బిల్లుల చెల్లింపులపై సమీక్షించారు. వేతనదారులందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో మర్రాపు సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందించేలా బోధించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాదరావు

రేగిడి: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేలా బోధించాలని ఉపాధ్యాయులకు ఎంఈవో ఎం.వి.ప్రసాదరావు సూచించారు. మండలంలోని పుర్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుశాతం, రికార్డులు, ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా లెస్సన్ ప్లాన్ ఆధారంగా పాఠ్యాంశాలు బోధించాలని, చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలన్నారు. అనంతరం జగనన్న గోరుముద్ద పథకం అమలు చూసి, రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు అందివ్వాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని సోపేరుకు చెందిన పెరుమాళి లక్ష్మికి మంజూరైన రూ.1.80 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్(ముఖ్యమంత్రి సహాయ నిధి) చెక్కును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ చేతులమీదుగా గురువారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరమని, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా కష్టాల్లోని నిరుపేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారన్నారు. గతంలో అనారోగ్యానికి గురైన లక్ష్మి పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నారని, ఆమె నిరుపేద కావడంతో ఆర్థికసాయానికి సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇప్పుడు నిధులు మంజూరు చేశారని తెలిపారు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటానని లక్ష్మి తెలిపింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, పార్టీ యూత్ అధ్యక్షుడు గెడ్డావు అప్పలనాయుడు, పీఏసీఎస్ డైరెక్టర్ ముదిలి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి..



రామలింగేశ్వరరావు దంపతుల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన రామలింగేశ్వరరావు దంపతులను గురువారం సత్కరించారు. ఇదే కార్యక్రమానికి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు హాజరై, ఆయనను సన్మానించి, ఆయన సేవలను ప్రశంసించారు. ఉద్యోగులకు వారు పనిచేసిన కాలంలో అందించిన మంచి సేవలతోనే గుర్తింపు వస్తుందని, వారు ఇక్కడ పనిచేసింది ఏడు నెలల కాలమే అయినా చాలా చక్కగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీలు బి.రమేష్, భాస్కరరావు, ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్డీ సూర్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

లెప్రసీ వ్యాధిపై అవగాహన



ఉంగరాడలో అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో లెప్రసీ వ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, చర్మంపై రాగిరంగు మచ్చలు, పూర్తిగా కాళ్లు మూసుకుపోవడం, చెవితమ్మిలు మందంగా తయారుకావడం వంటివి వ్యాధి లక్షణాలు అని, ఇవి మన శరీరంలో ఎక్కడైనా కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని రేగిడి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అప్పారావు తెలపారు. జిల్లా వైద్యాశాఖ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎం వినియోగంపై అవగాహన



పాల్తేరులో ఈవీఎం ఆధారంగా ఓటు ఎలా వేయాలో తెలియజేస్తున్న సిబ్బంది

బాడంగి: మండలంలోని గొల్లాది, కామన్నవలస, లక్ష్మీపురం, భీమవరం, పాల్తేరు, బొత్సవానివలస, హరిజనపాల్తేరు గ్రామాల్లో ఈవీఎం(ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)వినియోగం ద్వారా ఓటుహక్కు వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మొబైల్ వాహనం ద్వారా గ్రామగ్రామానికి వెళ్లి, గ్రామస్తులకు ఈవీఎం ఆధారంగా ఓటు వేసే విధానం వివరిస్తున్నామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



శ్రీకాకుళం రోడ్డులోని కల్కి అపార్ట్‌మెంట్ వాసులతో తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం సిటీ: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. గురువారం స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లిన ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా తెలియజేయాలన్నారు. అనంతరం నాలుగున్నరేళ్లుగా ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మేలును వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే సంక్షేమం, అభివృద్ధి కావాలంటే మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇక్కడి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను కూడా ఆశీర్వదించి, అసెంబ్లీకి పంపాలని కోరారు. ఆయన వెంట పార్టీ టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, పొట్నూరు లక్ష్మణరావు, పాలవలస శ్యామసుందర్, జగదీష్, గణపతి, సతీష్, బాబూరావు, జయలక్ష్మి, సుశీల, రమ్య, రామినాయుడు పాల్గొన్నారు.